క్లుప్తంగా

ప్రధానిపై రాహుల్ గాంధీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

నెల్లూరు(బారకాసు): ప్రపంచ కప్ ఫైనల్స్‌ను వీక్షించేందుకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని చెడు శకునమంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రధానిపై అగౌరవంగా మాట్లాడటం తగదని హితవు పలికారు.

పక్కాగా కులగణన

నెల్లూరు(పొగతోట): కులగణన ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ చిరంజీవి ఆదేశించారు. కులగణనపై నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కులగణన ప్రక్రియను ఈ నెల 27 నుంచి వచ్చే నెల మూడు వరకు ఇంటింటా నిర్వహించాలని తెలిపారు.

రైతుల ఖాతాల్లో నేరుగా పరిహారం

మనుబోలు : బద్వేలు–నెల్లూరు హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం నగదు నేరుగా వారి ఖాతాల్లోకి జమ అవుతుందని నెల్లూరు ఆర్డీఓ మలోల తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సేకరించిన భూములకు సంబంధించిన మంగళవారం ఆయన రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో భూములు కోల్పోయిన మండల రైతులతో సమావేశమై పరిహారంపై అవగాహన కల్పించారు. మండలంలోని వడ్లపూడి, చెరుకుమూడి, గురివిందపూడి గ్రామాల్లోని 67.61 ఎకరాల భూములను హైవే కోసం సేకరించినట్లు తెలిపారు. ఇందులో వడ్లపూడి రెవెన్యూ పరిధిలో 7.10 ఎకరాలు, చెరుకుమూడి పరిధిలో 47.38 ఎకరాల ప్రైవేటు భూములు తీసుకోగా గురివిందపూడిలో కేవలం 8 సెంట్ల భూమి మాత్రమే తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి 58 మంది రైతులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. ఈ భూముల్లో పండ్ల తోటలు, పెద్ద చెట్లు, బావులు ఉన్న చోట్ల అంచనాలకు రెండున్నర రెట్ల పరిహారం అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట డీటీ శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఇందుకూరుపేట : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి షేక్ ఖాదర్‌వలి అన్నారు. మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో లెప్రసీ, ఎయిడ్స్ బాధితులను పరిశీలించి, ప్రభుత్వం అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బాధితులు సకాలంలో మందులు వాడేలా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారుల బృందం శ్రావణ్‌కుమార్, నరసింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

మనుబోలు : ప్రతిఒక్కరం కలిసికట్టుగా బాల్య వివాహాలను అరికడుదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు రమణమ్మ, ఆదినారాయణమ్మ పిలుపునిచ్చారు. మనుబోలు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లలోపు బాలికలకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు 11 మందితో కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, పాఠశాల హెచ్‌ఎం, పొదుపు గ్రూపు సభ్యుడు, మహిళా వార్డ్ మెంబర్, ఏఎన్‌ఎం, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, యువ సమాఖ్య సభ్యుడు, అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీస్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా ఆడపిల్లలకు 18, మగ పిల్లలకు 21 సంవత్సరాల్లోపు వివాహాలు చేస్తుంటే ఈ కమిటీకి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో నాగార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, మహి ళా పోలీస్ శ్రావ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడాలి

మనుబోలు : రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ రైతులకు సూచించారు. మండలంలోని లక్ష్మీనరసింహాపురం, కాగితాలపూరు, పిడూరు గ్రామాల్లో నీటి యాజమాన్యంపై ఆయన మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డ్యామ్‌లలో నీరు తక్కువగా ఉందన్నారు. మనుబోలు మండలానికి విడతల వారీగా 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నందున ప్రస్తుత సీజన్‌లో వరి పంటకు ఎటువంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. వరినాట్ల సమయంలో రైతులు తమ పొలంలో 2 సెంటీమీటర్ల నీరు ఉండేలా చూసుకుంటే సరిపోతుందన్నారు. పిలకలు కట్టే సమయంలో 4 నుంచి 5 సెంటీమీటర్లు, చిరుపొట్ట దశ నుంచి కోత వరకూ 2 సెంటీ మీటర్లు నీరు పెట్టుకుంటే సరిపోతుందని తెలిపారు. ఆర్ఎన్ఆర్ విత్తనాల కోసం ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటే సరఫరా చేస్తామన్నారు.

ఎడతెరపిలేని వర్షం

• లోతట్టు ప్రాంతాలు జలమయం

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం కురిసిన ఎడతెరపిలేని వర్షంతో శివార్లలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపించింది. జనజీవనం అస్తవ్యస్తమైంది. వివిధ పనుల నిమిత్తం బయటకెళ్లే వారు నానా అగచాట్లు పడ్డారు. 25వ డివిజన్లోని తల్పగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ, 30వ డివిజన్లోని రెవెన్యూ కాలనీ, చంద్రబాబునగర్, తిరుమలనగర్, శ్రామిక నగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు రొచ్చురొచ్చుగా మారాయి. కాగా వర్షం కారణంగా రూరల్ మండలంలోని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చెరువును తలపిస్తున్న తల్పగిరి కాలనీ


నీటమునిగిన తల్పగిరి కాలనీ – ఆటోనగర్ రహదారి


జలదిగ్బంధనంలో ఆర్టీసీ కాలనీ

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు): భారీ వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. యుద్ధప్రాతిపదికన సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అండర్ బ్రిడ్జిల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా మోటార్ల సాయంతో ఎప్పటికప్పుడు తోడేయాలని సూచించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సభ జయప్రదానికి పిలుపు

నెల్లూరు (పొగతోట): విజయవాడలో డిసెంబర్ పదిన నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల మహాసభను జయప్రదం చేయాలని కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు, పోస్టర్లను నగరంలోని రెవెన్యూ భవన్‌లో మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో రాష్ట్ర కమిటీని ప్రకటించనున్నామని చెప్పారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అసోసియేట్ చైర్మన్ మురళి, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మహిధర్ బాబు, జనరల్ సెక్రటరీ విజయ్‌కుమార్, ట్రెజరర్ మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): మండల పూజలను పురస్కరించుకొని నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అయ్యప్పను దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయకర్తలుగా పోలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, శోభారాణి, జనార్దన్‌రెడ్డి, సుమతి, కూరపాటి మహేష్, మాధవి, బాబునాయుడు, శ్యామలమ్మ, సుధీర్‌కుమార్‌రెడ్డి, కుమార్ జితేంద్ర వ్యవహరించారు.



మత్స్యకారుల పక్షపాతి సీఎం

నెల్లూరు (దర్గామిట్ట): పులికాట్ సరస్సు పూడికతీత పనులకు చర్యలు చేపట్టి మత్స్యకారుల పక్షపాతిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆరంబాకం చంద్రశేఖర్ కొనియాడారు. మత్స్యకారుల సమస్యలపై కలెక్టరేట్లో ఏఓ షఫీమాలిక్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. మత్స్యకారులను ఎస్టీలుగా మార్చేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు. సోమశిలలో లైసెన్స్ లేని జాలర్లు అలివి వలలతో చేపల వేటను సాగిస్తున్నారని, వీరిపై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.



శిక్షణ కేంద్రంలో పరిశీలన


మెటీరియల్‌ను అందుకున్న వారితో సాంబశివారెడ్డి

నెల్లూరు (పొగతోట): నగరంలోని మున్సిపల్ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సార్టీపీ శిక్షణ కేంద్రాన్ని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పని పూర్తి చేసిన కుటుంబాల్లోని నిరుద్యోగ మహిళలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ఇంటర్ ఉత్తీర్ణులై.. 18 నుంచి 30 ఏళ్లలోపు ఉండి.. ఉన్నతి పథకంలో 100 రోజుల పని పూర్తి చేసిన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు 94935 13896 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అనంతరం శిక్షణలో ఉన్న వారికి ఉచితంగా యూనిఫారం, మెటీరియల్‌ను అందజేశారు. హైమావతి, సౌజన్య, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో మత్స్య దినోత్సవం

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని జంతు శాస్త్రం, అగ్రికల్చర్ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ గిరి, హెచ్‌ఓడీ రంజని, అధ్యాపకురాలు రమాదేవి, పీఆర్వో జోజి తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతుల ప్రదానం

మాదరాజుగూడూరులో ‘వై ఏపీ నీడ్స్ జగన్’


వైఎస్సార్సీపీ పతాకావిష్కరణ

నెల్లూరు రూరల్: మాదరాజుగూడూరులోని సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఎస్ రూరల్ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ రూరల్ మండల కన్వీనర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

24న తులసీ, దామోదర కల్యాణం

నెల్లూరు(బృందావనం): క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని అష్టలక్ష్మి మందిరంలో గల కృష్ణ యోగ మందిర ప్రాంగణంలో తులసీ, దామోదర కల్యాణాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నామని మందిర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందిర ప్రాంగణంలోని ఉమాదేవి సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో అర్చనలు, అభిషేకాలను నిర్వహించనున్నామని చెప్పారు. భక్తులు తరలిరావాలని కోరారు.

యువకుడిపై దాడి

నెల్లూరు(క్రైమ్): యువకుడిపై ఇద్దరు వ్యక్తులు అకారణంగా దాడి చేసి గాయపర్చిన ఘటనపై చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. లీలామహల్ సెంటర్‌లోని ఓ ఫ్రైడ్ రైస్ దుకాణంలో దినేష్ పనిచేస్తున్నారు. పాతకక్షలో.. మరే ఇతర కారణమో తెలియదుగానీ ఇద్దరు యువకులు బైక్‌పై సోమవారం రాత్రి వచ్చి అతనిపై విచక్షణరహితంగా దాడి చేశారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన దినేష్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు.

‘విద్యార్థులతో యాజమాన్యాల చెలగాటం’

నెల్లూరు (టౌన్): జగనన్న విద్యాదీవెనతో సంబంధం లేకుండా డిగ్రీ విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజును కట్టించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నలిశెట్టి రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థులతో ఫీజు కట్టించుకోకుండా కళాశాలల యాజమాన్యాలు చెలగాటమాడుతున్నాయని ఆరోపించారు. ఫీజును కట్టించుకోకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నాను చేపడతామని స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాల్లేకుండా చర్యలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఈదురుగాలులకు ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపోయినా.. స్తంభాలు వాలినా వెంటనే సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఏఈలు, క్షేత్రస్థాయి సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. విద్యుత్ సమస్యలు ఏర్పడితే 94408 17468 నంబర్‌కు తెలియజేయాలని కోరారు. సిబ్బంది 24 గంటలూ విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు.


మాట్లాడుతున్న విజయన్

భవానీ శంకరుడికి అభిషేకాలు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని వేదాయపాళెంలోని కృష్ణ మందిర ప్రాంగణంలో కొలువైన భవానీశంకరుడికి విశేష పూజలను మంగళవారం నిర్వహించారు. పూజలను ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. అఖండ దీపప్రజ్వలన, ఆకాశ దీపాన్ని వెలిగించారు. ఉభయకర్తలుగా పామూరు మధుసూదన్, మధుస్మిత దంపతులు వ్యవహరించారు. కార్తీక మాస విశిష్టతను టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా సమన్వయకర్త స్వామినాయక్, మల్లెల శ్రీహరి వివరించారు. మందిర ధర్మకర్త వెంకటేశ్వర్లు, కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.



అర్హులను ఓటర్లుగా చేర్పించండి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అర్హులను గుర్తించి.. సంబంధిత ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి ఓటరు జాబితాలో చేర్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో ఎన్నికల విభాగాధికారులు, సూపర్‌వైజర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని అన్ని సచివాలయాల్లో అర్హులైన ఓటర్ల నుంచి ఫారాలను డిసెంబర్ తొమ్మిది వరకు సేకరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఓటరు ముసాయిదా జాబితాలో మార్పులు చేర్పులను చేపట్టాలని ఆదేశించారు. ఏఈఆర్వోలు దేవీకుమారి, నిర్మలానందబాబా, శ్రీనివాసులు, దశయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ఓటర్ల లిస్ట్, డ్రాఫ్ట్ రోల్ రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగంలో నిర్వహించిన సమావేశంలో బాలశంకర్‌రెడ్డి, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

నెల్లూరు(బారకాసు): నగరంలోని 14వ డివిజన్ పరిధిలో గల ఏసీనగర్ సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, అదనపు కమిషనర్ శర్మద మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారికి బీపీ తదితర పరీక్షలను నిర్వహించారు.



బీసీ భవన్ నిర్మాణానికి వినతి

నెల్లూరు రూరల్: కొండాయపాళెం గేట్ వద్ద నిర్మాణంలో ఉన్న బీసీ భవన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘ నేతలు కోరారు. ఈ మేరకు ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. కాగా సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.


ఆదాల ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి, వేదపారాయణదారుడు అవ్వారి వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, సభ్యులు దొరబాబు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించరూ..

నెల్లూరు(దర్గామిట్ట): తమ సేవలను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ కార్మికులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడారు. సమస్యను పరిష్కరించకపోతే డిసెంబర్ 15 తర్వాత నిరవధిక సమ్మెను చేపడతామని స్పష్టం చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి అశోక్, రూరల్ అధ్యక్ష, కార్యదరులు సుజాతమ్మ, దేశమూర్తి, కొండమ్మ, వజ్రమ్మ, జేమ్స్ బాబు, భాగ్యమ్మ, శ్రీనివాసులు, లోకేష్, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.



వరిసాగులో నీటి యాజమాన్యం కీలకం

నెల్లూరు రూరల్: వరిసాగులో నీటి యాజమాన్య పద్ధతులు ఎంతో కీలకమని నెల్లూరు ఏడీఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. కలివెలపాళెంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రైతు శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. వరిసాగులో అధిక దిగుబడులు సాధించేందుకు గానూ నీటి యాజమాన్య పద్ధతులను తప్పక పాటించాలని సూచించారు. రూరల్ మండల వ్యవసాయాధికారి నాగమోహన్, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాసులు